ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -53 పేజీలు - 8 వెల - 03/- శుక్రవారం 12 జూన్ 2026

# సమిష్టి కృషే కీలకం

## సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో దేశాభివృద్ధి

### రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం మార్గదర్శకంగా ఉండాలి

### :నితి ఆయోగ్ 11వ పాలక మండలి భేటీలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, చర్చలు, ఇచ్చిపుచ్చుకోవడం మార్గదర్శకంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. వికసిత్ భారత్ దార్శనికత దిశగా రాష్ట్రాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి, కలిసి పనిచేయడానికి వీలు కల్పించే ఒక సహకార వేదికగా నిటి ఆయోగ్ కీలక పాత్ర పోషించగలదని తెలిపారు. గురువారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ప్రధాని అధ్యక్షతన నిటి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎ.రేవంత్‌రెడ్డి, ఎన్.చంద్రబాబు నాయుడుతో పాటు అన్ని రాష్ట్రాల సీఎంలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు, ఎక్స్-అఫీషియో సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్రమంత్రులు, **మిగతా 2లో...**






# ఒమన్ తీరంలో జల్ వీర్‌పై అమెరికా దాడి

**మూడ్రోజుల్లో మూడు నౌకలపై క్షిపణులతో విధ్వంసం**

**అమెరికా దౌత్యవేత్తకు సమన్లు**

**వాణిజ్య నౌక లక్ష్యంగా జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన భారత విదేశాంగ శాఖ**

**మస్కట్ : జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** ఒమన్ సమీపంలో భారత నౌక 'జల్ వీర్' పై దాడి జరిగింది. ఈ దాడిలో గల్లంతైన ముగ్గురు భారతీయులు మృతి చెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. అయితే ఒమన్ సముద్ర మార్గంలో వెళ్తున్న భారత నౌకలపై మూడు రోజుల్లో మూడు దాడులు జరగడం గమనార్హం. **మిగతా 2లో...**

# రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

## : మంత్రి పొంగులేటి

**తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నట్టు పొంగులేటి వెల్లడి**

**దీని ద్వారా శిథిలావస్తలో ఉన్న భవనాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వెల్లడి**



**హైదరాబాద్, జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈరోజు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**

## వికసిత్ భారత్ 2047అనుగుణంగా

# స్వర్ణాంధ్ర 2047

**పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం -కొత్తగా పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ**

**విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్**

**నీతి ఆయోగ్ భేటీలో సిఎం చంద్రబాబు**




**న్యూఢిల్లీ, జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** పాలనలో డిజటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నామని అలాగే ఏపీలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విద్యార్థుల కోసం ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తామని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర 2047' ప్రతిష్ఠాత్మక **మిగతా 2లో...**




# విద్యా వ్యవస్థలో లోపాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు

**ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నా.. పట్టించుకోని కేంద్రం**

**: ఏఐసీసీ సమావేశ నిర్ణయాలను వెల్లడించిన కెసి వేణుగోపాల్**

# నేటి నుంచి బడులు

**బ్యాగు, బూట్లు, యూనిఫాం ఆలస్యం**

**జులై తొలివారంలో తల్లికి వందనం**




# ఎపి మద్యం కేసులో ఇడి దూకుడు

## రాజ్‌కసిరెడ్డిఅరెస్ట్ -పలుచోట్ల ఇడి ముమ్మర సోదాలు

**హైదరాబాద్, జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దూకుడు పెంచింది. ఏపీ మద్యం స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్‌కెసిరెడ్డిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. . హైదరాబాద్ ఫిలింనగర్‌లోని నివాసంలో కారుమూరిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లిక్కర్ స్కామ్‌లో విచారణను వేగంతం చేసిన ఈడీ.. గురువారం ఉదయం హైదరాబాద్ నగరవ్యాప్తంగా పదిచోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఇందులో భాగంగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని అరెస్ట్ చేసి ఈడీ కార్యాలయానికి తరలించారు. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి తెలుగు రాష్ట్రాల్లో మరోసారి ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. **మిగతా 2లో...**



# డీఎస్సీ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలి

### లక్షలాది మంది జీవితాలతో ఆడుకున్నారు.. : వైఎస్ జగన్



**అమరావతి : జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** ఏపీ మెగా డీఎస్సీ పరీక్ష, నియామకాల ప్రక్రియలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో విచారణ జరిపించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ డిమాండ్ చేశారు. నేడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డీఎస్సీకి సంబంధించి వెలుగులోకి వస్తున్న వాస్తవాలు**మిగతా 2లో...**

# ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం..



**కూటమి ఖాతాలోకి మరో నలుగురు ఎంపీలు**

**ప్రత్యర్థి పార్టీల నుంచి రాని నామినేషన్లు**

**టీడీపీ తరపున విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ గెలుపు**

**జనసేన నుంచి లింగమనేని రమేశ్ జయకేతనం**

**అమరావతి : జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ కోటాలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవం అయింది. కూటమిలో భాగంగా తెలుగుదేశం పార్టీ నుంచి ముగ్గురు,**మిగతా 2లో...**



# కేంద్రం సహకరించాలి

### ప్రధాని మోడీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం నాడిక్కడ ప్రధాని నరేంద్ర మోడీతో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు. **మిగతా 2లో...**

# సమిష్టి కృషే కీలకం

**మొదటిపేజీ తరువాయి**

నిటి ఆయోగ్ వైస్ ఛైర్మెన్, సభ్యులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పాల్గొన్నారు. '2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం అందరికీ సమ్మిళిత అభివృద్ధి ఫలాలు'ను ఈ సంవత్సరం ఇతివృత్తంగా ఎంపిక చేశారు.

దేశంలో ప్రతి ఒక్కరికీ నిర్దిష్ట, గణనీయమైన ఫలితాలను అందించడానికి అవలంభించాల్సిన విధానంపై పాలక మండలి సమావేశంలో చర్చించారు. అలాగే సమ్మిళిత మానవాభివృద్ధి ప్రాథమిక ప్రణాళిక పైనా చర్చలు జరిపారు. '

'1. మూలాధార మానవ పెట్టుబడి, రాబోయే కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సన్నద్ధంగా ఉండే నైపుణ్యాలు. 2. ఉత్పాదక ఉపాధికల్పన, ఔత్సాహిక పారిశ్రామికత్వం, వికేంద్రీకరించిన అభివృద్ధి. 3. ఆరోగ్యం, పోషణ, సంక్షేమం. 4. అందరికీ సమాన అవకాశాలు, ఆత్మగౌరవం" వంటి నాలుగు ముఖ్యాంశాల ఆధారంగా చర్చలు నిర్వహించారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా ఔత్సాహిక పారిశ్రామికత్వాన్ని, నైపుణ్యాల సాధనను ప్రోత్సహించడంతో పాటు దీర్ఘకాలం పాటు మనుగడలో ఉండే ఉద్యోగావకాశాలను కల్పించడానికి ఏయే చర్యలు తీసుకోవాలన్నదాని గురించి కూడా చర్చించారు. పాలన, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), భాగస్వామ్యాలు, డేటా ఆధారిత వ్యవస్థలు సహా ప్రధాన సహాయకారి అంశాలను వినియోగించుకుంటూ ఒక కార్యాచరణ నమూనాను రూపొందించడంపై దృష్టి సారించారు. సమ్మిళిత మానవ అభివృద్ధిపై జాతీయ దృష్టికోణానికి, రాష్ట్రాల దృష్టికోణాలకు మధ్య పొందికను సమకూర్చడంపై చర్చలు జరిపారు. ఫలితంగా సమాన, దీర్ఘకాలిక అభివృద్ధి దిశగా ఏకీకృత, సహకార ప్రధాన విధానాన్ని అమలు చేయడానికి మార్గం సుగమం అవుతుందని చర్చల్లో వివరించారు.

నిటి ఆయోగ్ పాలక మండలి 2025 డిసెంబరు 26 నుంచి 28 మధ్య నిర్వహించిన ముఖ్య కార్యదర్శుల 5వ జాతీయ సమావేశం సిఫారసులు "1. బాల్యంలో ముందస్తు విద్యాబోధన: పునాదిని వేయడం. 2. పాఠశాల విద్యాబోధన: మూలాధారంగా నిలిచే నిర్మాణం. 3. నైపుణ్యాలను నేర్పించడం: భవిష్యత్తు అవసరాల కోసం సన్నద్ధులై ఉండే శ్రమ శక్తి. 4. ఉన్నత విద్యాబోధన: జ్ఞానాధారిత ఆర్థికవ్యవస్థను ఏర్పాటు చేయడం. 5. క్రీడలు, పాఠ్యాంశేతర కార్యకలాపాలు: తరగతి గదులకు ఆవల సన్నాహక చర్యలు"పై కూడా ఈ సమావేశంలో చర్చించారు.

**సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో దేశ అభివృద్ధి : మోదీ**

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడు తూ.. అభివృద్ధి చెందిన దేశం అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేసుకోవడంలో కేంద్ర, రాష్ట్రాల సమిష్టి కృషి కీలక పాత్ర పోషిస్తుందని నొక్కి చెప్పారు. ప్రపంచం ప్రస్తుతం అనిశ్చితి, అస్థిరతతో కూడిన కాలం గుండా వెళ్తున్నప్పటికీ.. భారత్ ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో తన వృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. సహకార సమాఖ్యవాద స్ఫూర్తితో, దేశ అభివృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి మనం కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. వృద్ధి, ఎగుమతులకు కొత్త అవకాశాలను సృష్టించేం దుకు భారత్ అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసిందని ఆయన నొక్కి చెప్పారు. ఈ ఒప్పందాలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఒక ముఖ్యమైన అవకాశాన్ని అందిస్తున్నాయని తెలిపారు. దేశ జనాభా డివిడెండ్‌ను దేశం కోల్పోలేని ఒక చారిత్రాత్మక అవకాశంగా ప్రధాని మోడీ అభివర్ణించారు. నాణ్య మైన విద్య, డిమాండ్‌కు అనుగుణమైన నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలతో యువత కోసం సరైన వ్యవస్థను సృష్టించాలని ఆయన పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ దార్శనికతకు మహిళా నేతృత్వంలోని అభివృద్ధి ఒక మూలస్తంభమని గుర్తించారు. వ్యవసాయం, స్టార్టప్‌ల నుంచి సైన్స్, ఆవిష్కరణల వరకు నారీ శక్తి వివిధ రంగాలలో తన వంతు కృషి చేస్తోందని చెప్పారు.

## డీఎస్సీ స్కామ్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలి: వైఎస్ జగన్

**మొదటిపేజీ తరువాయి**

అత్యంత దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కుంభకోణాలతో లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని వమ్ము చేసిందని, ప్రతిభావంతులైన నిరుద్యోగుల జీవితాలను తీవ్రంగా దెబ్బతీసిందని జగన్ ఆరోపించారు. ఇంతటి దారుణమైన నియామక ప్రక్రియను ఎక్కడా చూడలేదని అన్నారు. "అబద్ధాలు, మోసం, దగా, వెన్నుపోటు, కుంభకోణాలకు చొక్కా, ప్యాంటు వేస్తే అది చంద్రబాబు అవుతారు" అని ఆయన విమర్శించారు. లక్షలాది మంది యువత ఆశలు, భవిష్యత్తు ముడిపడి ఉన్న డీఎస్సీ వంటి ప్రక్రియలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటం అత్యంత దారుణమని అన్నారు.

**'మేమూ బొద్దింకలమే.. జనరేషన్ జెడ్ చూస్తోంది'**

ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను జనరేషన్ జెడ్ (+వఅ ) గమనిస్తోందని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "చంద్రబాబూ గుర్తుంచుకో, ఇది జెన్ జెడ్. జెన్ ఆల్ఫా కూడా వస్తోంది. తప్పులు ఒప్పుకోకుండా ఇబ్బంది పెడితే బొద్దింకలు తిరగబడతాయి" అని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీక్ తర్వాత ఆన్‌లైన్‌లో మొదలైన 'జనతా కాక్రోచ్ పార్టీ' ఉద్యమం గురించి ప్రస్తావించగా, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మేం కూడా బొద్దింకలమే. యువతకు అన్యాయం జరిగితే వారు ఇలాంటి మార్గాలనే ఎంచుకుంటారు" అని జగన్ పేర్కొన్నారు.

**అక్రమాలపై జగన్ వివరణ**

డీఎస్సీ అక్రమాలపై జగన్ వివరంగా మాట్లాడుతూ.. 1995 నుంచి చంద్రబాబు పాలన లీకులు, అవినీతితోనే నిండిపోయిందన్నారు. ఈసారి డీఎస్సీ కన్వీనర్‌ను పక్కనపెట్టి, ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు అప్పగించారని, ఒకే అధికారి చేతిలో కీలక అధికారాలు కేంద్రీకరించి పారదర్శకతను దెబ్బతీశారని ఆరోపించారు. ప్రశ్నపత్రం ఎంతమంది చేతుల్లోకి వెళ్లింది, ఎంత డబ్బు చేతులు మారింది అనే విషయాలు థర్డ్ పార్టీ ఏజెన్సీ విచారణలోనే తేలుతాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయంటూ జగన్ ధ్వజమెత్తారు. "స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు అర్హత పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఉంటే చాలని జీవోలు ఇచ్చి తమకు కావాల్సిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇచ్చిన కాలేజీ, యూనివర్సిటీ, జిల్లా స్థాయి పోటీల పార్టిసిపేషన్ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు ఇచ్చారు. మరోవైపు, జాతీయ క్రీడల్లో బంగారు పతకాలు సాధించి ఇంటర్వ్యూలకు పిలిపించిన నిజమైన అభ్యర్థులకు ఉద్యోగాలు రాలేదు. మొత్తం 270 మంది అర్హత పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు" అని జగన్ వివరించారు.

**సీబీఐ విచారణే శరణ్యం**

తమ హయాంలో నోటిఫికేషన్ నుంచి నియామక పత్రాలు ఇచ్చే వరకు కేవలం నాలుగు నెలల్లో 1.30 లక్షల ఉద్యోగాలను ఎలాంటి లోపాలు లేకుండా భర్తీ చేశామని జగన్ గుర్తుచేశారు. డీఎస్సీ వ్యవహారంలో చంద్రబాబు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఆయన కుమారుడు లోకేశ్ ముద్దాయిలని, వారే తీర్పు చెబితే న్యాయం జరగదని, అందుకే సీబీఐ విచారణ డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. జూన్ 12న తలపెట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన కార్యక్రమంలో ఈ డీఎస్సీ అక్రమాల అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు

# కేంద్రం సహకరించాలి

**మొదటిపేజీ తరువాయి**

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్2లో ఏడు కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు రూ.38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. ట్రిపుల్ ఆర్ పనులకు ఆమోదం తెలపండి

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్‌ఏఐకి రూ.626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌అమరావతిబందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు.

120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనుల గురించి ప్రస్తావన వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ది చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం-2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

## విద్యా వ్యవస్థలో లోపాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు

### ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నా.. పట్టించుకోని కేంద్రం

### : ఏఐసీసీ సమావేశ నిర్ణయాలను వెల్లడించిన కెసి వేణుగోపాల్



**న్యూఢిల్లీ జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :**
దేశ సమస్యలు, విద్యావ్యవస్థలో లోపాలపై రానున్న రెండు, మూడు నెలలపాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు, ప్రచారాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఉన్న సమస్యలకు ప్రధాని మోడీ వెంటనే సమాధానం చెప్పాలని అన్నారు. మోడీ సర్కారు పాలనలో ప్రజలు, ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నాయని ఆరోపించారు. గురువారం నాడిక్కడ ఇందిరా భవన్‌లో అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత ఏఐసీసీ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై కాంగ్రెస్ అగ్రనేతలు చర్చించారు. మూడు గంటల పాటు సుదీర్ఘంగా ఈ భేటీ కొనసాగింది. ఈ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెసి వేణుగోపాల్ వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్త ఆందోళనలు, ప్రచారాలకు సంబంధించి మూడు, నాలుగు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. మధ్యప్రదేశ్, జార్ఖండ్‌లో పరిస్థితులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయని విమర్శిం చారు. కోర్టు నోటీసు ఆధారంగా చేసుకుని ఎఫ్ఐఆర్ లేకపోయినా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జార్ఖండ్‌లో బీజేపీ అభ్యర్థి నామినేషన్ పత్రాలు సరిగ్గా నింపకపోయినా ఆ నామినేషన్ అంగీకరించారని గుర్తు చేశారు.

### వికసిత్ భారత్ 2047అనుగుణంగా

# స్వర్ణాంధ్ర 2047

**మొదటిపేజీ తరువాయి**

విజన్ ప్లాన్‌ను సమర్పించారు. పేదరిక నిర్మూలన, భారీస్థాయిలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలుగా స్వర్ణాంధ్ర రోడ్‌మ్యాప్ ప్రకటించారు. గడిచిన రెండేళ్లలో ఏపీ పారదర్శక విధానాల వల్ల రూ. 23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులని ఆకర్షించామని వెల్లడించారు. ఆర్టీజీఎస్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 'అవేర్' వంటి ప్రిడిక్టివ్ టూల్స్‌తో ఏపీలో సాంకేతిక పాలన కొనసాగిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య అనారోగ్యకర పోటీ వద్దని సూచించారు. మౌలిక వసతులు, స్థిరమైన విధానాలపై దృష్టి పెట్టాలని ఆయా రాష్ట్రాలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబానికి ఇళ్లు, తాగునీరు, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ సహా 7 ప్రాథమిక అవసరాలు కల్పించడమే ఏపీ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న 10శాతం మంది.. వెనుకబడిన 20శాతం మందిని ఆదుకునేలా వినూత్న కార్యక్రమం తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో నివారణ ఆరోగ్య సంరక్షణ, డిజిటల్ హెల్త్ రికార్డుల కోసం 'ప్రాజెక్ట్ సంజీవని' అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేసేలా ఏఐ లెర్నింగ్, క్వాంటం టెక్నాలజీస్, అడ్వాన్స్‌డ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్స్ తీసుకువస్తున్నట్లు వివరించారు. ఏపీలో సంతానోత్పత్తి రేటు 1.5శాతం కంటే తగ్గడంపై సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మానవ వనరుల కొరత, వృద్ధాప్య సమస్యలను అధిగమించేందుకు ఏపీలో కొత్త 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకువస్తామని వివరించారు. వికసిత్ భారత్ 2047 సాధన కోసం కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్‌తో కలిసి పనిచేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఎపి మద్యం కేసులో ఇడి దూకుడు

**మొదటిపేజీ తరువాయి**

ఈ కేసులో కీలక సూత్రధారి రాజ్ కెసిరెడ్డి ఇళ్లతోపాటు మరో ఆరుగురి నిందితుల ఇళ్లలో గురువారం ఉదయం నుంచి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ఆయన బంధువు నరసింహారెడ్డి ఇల్లు, కార్యాలయాల్లోనూ దాడులు కొనసాగుతున్నాయి. ఏపీ మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. హవాలా, మనీలాండరింగ్ ద్వారా నిధులు తరలించినట్లు ఈడీ గుర్తించింది. ఈ క్రమంలో నానక్‌రామ్‌గూడలోని నివాసంలో రాజ్‌కెసిరెడ్డిని ఈడీ అరెస్ట్ చేసింది. ఏపీలోని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇల్లు, కార్యాలయంలోనూ సోదాలు కొనసాగాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ప్రాథమిక విచారణ జరిపిన ఈడీ అధికారులు.. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద అభియోగాలు మోపి, తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసులో 33 మందిని నిందితులుగా చేర్చారు. వైకాపా ప్రభుత్వ పెద్దల తరఫున మద్యం కుంభకోణంలో అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డితో పాటు వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం సీఎంవో కార్యదర్శిగా పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలతో పాటు ఏపీఎస్‌బీసీఎల్ పూర్వపు ఎండీ డి.వాసుదేవరెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేకాధికారి సత్యప్రసాద్, ఎస్‌పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ పూర్వపు డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి, మద్యం ముడుపుల వసూళ్లలో కీలకంగా వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి, వీరి అనుచరులు బూనేటి చాణక్య, టి.కిరణ్‌కుమార్‌రెడ్డి, సైఫ్ అహ్మద్‌తో పాటు మద్యం ముడుపుల సొత్తు రూటింగ్ కోసం వినియోగించిన పలు డొల్ల సంస్థల యాజమాన్యాలను నిందితులుగా ఈడీ చేర్చింది. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద మద్యం కుంభకోణం కావటంతో పాటు సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి వసూలు చేసిన దాదాపు రూ.3,200 కోట్ల ముడుపులను కల్పిత, ఊహాజనిత కంపెనీల ద్వారా వివిధ దశల్లో రూటింగ్ చేసి అంతిమ లబ్దిదారుకు చేర్చినట్లు ప్రాథమికంగా గుర్తించిన ఈడీ.. దర్యాప్తులో మూలాలను వెలికితీస్తోంది.

# నేటి నుంచి బడులు

**అమరావతి : జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :**
రాష్ట్రంలో వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 24 నుంచి బడులకు వేసవి సెలవులు ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రతియేటా బడులు ప్రారంభమయ్యే నాటికి సిద్ధమవుతుండగా, ఇప్పటి వరకు రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఇఆర్‌టి) అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయకపోవడం గమనార్హం. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లలో యూనిఫాం, బ్యాగు, బూట్లు అందించడం లేదు. పశ్చిమ దేశాల్లో నెలకొన్న యుద్ధం కారణంగా నెలరోజులు ఆలస్యంగా అందిస్తామని సమగ్రశిక్ష ఇప్పటికే వెల్లడించింది. కిట్‌లోని పాఠ్యాంశ పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీ వంటివి అందిస్తామని వెల్లడించింది. మెగా పిటిఎం నాటికి మిగిలిన వస్తువులను అందిస్తామని చెప్పింది. గతేడాది పాఠశాలలు ప్రారంభం రోజునే అమలు చేసిన తల్లికి వందనం కూడా ఈ ఏడాది ఆలస్యం కానుంది. ఈ పథకం అమలు చేసేందుకు నిధుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. అవసరమైన నిధులను ఆర్థికశాఖ సమీకరించు కుంటోందని అంటున్నారు. జులై తొలివారంలో తల్లుల ఖాతాల్లో ఈ పథకం నిధులను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

## ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం..

**మొదటిపేజీ తరువాయి**

జనసేన పార్టీ నుంచి ఒకరిని ఆయా పార్టీల అధిష్ఠానాలు బరిలోకి దించాయి.

టీడీపీ అభ్యర్థులుగా చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ నామినేషన్లు దాఖలు చేయగా, జనసేన తరఫున లింగమనేని రమేశ్ నామినేషన్ వేశారు. ప్రత్యర్థి పార్టీల నుంచి ఎలాంటి నామినేషన్లు రాకపోగా, ఉపసంహరణ గడువు కూడా ఇవాళ్టితో ముగియడంతో ఈ నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ధృవీకరించారు.

## ఒమన్ తీరంలో జల్ వీర్‌పై అమెరికా దాడి

**మొదటిపేజీ తరువాయి**

ఓ వైపు భారత నౌకలపై ఎలాంటి ఆంక్షలు లేవని ఇరాన్ అంటుంటే.. మరోపక్క భారత్ హార్ముజ్ మార్గంలో కాకుండా ఒమన్ సముద్ర తీరం నుంచి రాకపోకలు సాగిస్తోంది. అయితే భారత్ ను ఇరకాటంలో పెట్టడమే కాదు. ఇరాన్ పై బురదజల్లేలా అమెరికా దుష్ట పన్నాగం చేస్తుందన్న వాస్తవాన్ని ఎట్టకేలకు భారత్ గుర్తించింది. ఒమన్ తీరంలో వాణిజ్య నౌక 'జల్ వీర్'పై దాడి జరిగిన సమయంలో ఓడలో మొత్తం 28 మంది ప్రయాణిస్తుండగా, వారిలో 24 మంది భారతీయులు ఉన్నారు. ఈ దాడి తర్వాత ముగ్గురు భారతీయులు గల్లంతైనట్టు సమాచారం. కాగా మరో 21 మంది సురక్షితంగా ఉన్నట్టు ప్రకటించింది. అయితే గల్లంతైన ఆ ముగ్గురూ అమెరికా జరిపిన వైమానిక దాడిలో చనిపోయినట్టు నిర్ధారణ అయ్యింది. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగానే ఇది జరిగి ఉండవచ్చని బ్రిటిష్ సముద్ర భద్రతా సంస్థ ఎంబ్రాయర్ చెప్పినట్లు రాయిటర్స్ పేర్కొంది. దాడి జరిగితే ఓడ వెనుక భాగంలో కాకుండా, ముందు భాగంలో గుమిగూడాలని సిబ్బందిని గతంలోనే హెచ్చరించినట్టు తెలిపింది.

### రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి

**మొదటిపేజీ తరువాయి**

తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు.

గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# యోగా కార్యక్రమాల విజయవంత నిర్వహణకు అధికారులు, యోగా అసోసియేషన్లు సమన్వయంతో పనిచేయాలి

**యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యం - ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి**

**అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో నిర్వహించనున్న యోగా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, యోగా అసోసియేషన్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో యోగ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై యోగా ప్రచార కార్యక్రమాలు, ప్రజల్లో యోగాపై అవగాహన పెంపు చర్యలు, నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 7 నుండి 21 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక యోగా కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది యోగా కార్యక్రమాల్లో పాల్గొని విశేష స్పందన చూపారని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాలకు ప్రత్యేక థీమ్‌లను కేటాయించగా, నంద్యాల జిల్లాకు యోగా అసోసియేషన్ల భాగస్వామ్యంతో ఈనెల 17వ తేదీ కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా సూచించియున్నారని కలెక్టర్ తెలిపారు. శ్రీశైలం, మహానంది వంటి ఆధ్యాత్మిక క్షేత్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యోగా ప్రాముఖ్యతను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు మహానంది దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు సుమారు 1,500 మంది పాల్గొనే యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే జూన్ 17న నంద్యాల పట్టణంలో సుమారు 5,000 మంది పాల్గొనే భారీ యోగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. యోగా కార్యక్రమాల నిర్వహణకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ వెలుపల ఉన్న ప్రాంగణాన్ని ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పాల్గొనే వారికి అనుకూలంగా డయాస్ ఏర్పాటు, గ్రీన్ కార్పెట్, తాగునీటి సదుపాయం, పారిశుధ్య నిర్వహణ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచి ప్రతిరోజూ ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. చిన్న రాళ్లు, వ్యర్థాలను తొలగించి గ్రీన్ మ్యాట్లతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ డిఎస్డిఓను కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ, శానిటేషన్ లేదా ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు హౌస్‌కీపింగ్ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు 'పురమిత్ర' మొబైల్ యాప్‌లను వినియోగించాలని సూచించారు. రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, పన్నులు, పౌర సేవలు తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ యాప్‌ల ద్వారా నమోదు చేస్తే 24 గంటల్లోపు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా 'పురమిత్ర' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులభంగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. అదేవిధంగా, పాఠశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రజా ప్రదేశాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ప్లాస్టిక్ రహిత నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఆయుష్ కోఆర్డినేటర్ డా. యశోధర, డిఎస్డిఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు జబ్బ వాపు వ్యాధి అత్యంత ప్రమాదకరం

**- పశువైద్యాధికారిని డాక్టర్ అనూష -11వ తేదీ నుంచి 30 వరకు పశువులకు టీకాలు**



**బండి ఆత్మకూరు, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్):-** వర్షాకాల ప్రారంభంలో జబ్బవాపు వ్యాధి తెల్ల పశువులకు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందనీ.. జబ్బ వాపు వ్యాధి అత్యంత ప్రమాదకరమైనదనీ పశువైద్యాధికారిని డాక్టర్ అనూష తెలిపారు. ఇందులో భాగంగా పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ముందు జాగ్రత్త చర్యగా పశువులకు జబ్బ వాపు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు ఆమె తెలిపారు. గురువారం నాటి నుంచి ఈనెల 30వ తారీకు వరకు ప్రతి గ్రామంలో పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. తొలి రోజు మండలంలోని పెద్దదేవలాపురం, చిన్నదేవలాపురం, భోజనం గ్రామాలలో జబ్బ వైపు టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు కీలక సూచనలు చేశారు. రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. వర్షాకాలంలో మట్టి ద్వారా కలుషితమైన మేతమేయడం , నీటిని తాగడం ద్వారా సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి జబ్బ వాపు వ్యాధిని వ్యాప్తి చేస్తాయనీ ఆమె తెలిపారు. వ్యాధిని కలిగించే సూక్ష్మజీవులు మట్టిలోనూ, పచ్చిక బయళ్ళలోను ఉంటాయన్నారు. దీంతో రైతులు జాగ్రత్తగా పశువుల ఆరోగ్యం పట్ల ఉండాలన్నారు.

**జబ్బ వాపు వ్యాధి లక్షణాలు :**

వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం 104 డిగ్రీ ఫారం హిట్ ,ఆకలి మందగించడం ,మేత మేయకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వీటితో పాటు వేగంగా శ్వాస తీసుకోవడం, భుజము లేదా తొడ భాగాలలో నొప్పితో కూడిన వాపులు ఉండడం, కుంటుతూ నడవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వర్షాకాలం ప్రారంభంలో జబ్బ వాపు వ్యాధి తెల్ల పశువులకు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని పశువైద్యాధికారి తెలిపారు. ఈ వ్యాధిని రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట జేవివో సునీల్ కుమార్, విఏ పాపిరెడ్డి, ఆహాలు జయశ్రీ, అర్జున్, రమేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణపల్లి గ్రామంలో బడి పిలుస్తుంది కార్యక్రమం

**ఐదు సంవత్సరాల నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి**

**మండల విద్యాశాఖ అధికారి జి ఓంకార్ యాదవ్ మరియు మండల టిడిపికన్వీనర్ నాగిరెడ్డి**





**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 11(రిపబ్లిక్ న్యూస్)**

గురువారం రోజుఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె గ్రామం నందు బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని, గ్రామంలో ర్యాలీ మరియు మానవహారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జీ.ఓంకార్ యాదవ్,టిడిపి మండల కన్వీనర్ బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమన్న , పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మరియు ఉపాధ్యాయులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు,విద్యార్థులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వీజూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అనగా మధ్యాహ్నం భోజనం పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్, బెల్ట్, నోటు పుస్తకాలు మొదలగునవి ఉచితంగా అందజేస్తున్నారని తెలియజేయడం జరిగింది.

## ఓర్వకల్లు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం




**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 11(రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల కేంద్రంలోప్రభుత్వ ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్‌లో మిగిలి ఉన్న 8వ తరగతి, 9వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.దరఖాస్తుల స్వీకరణ 10-06-2026 నుండి 20-06-2026 వరకు జరుగుతుంది. 8వ తరగతి మరి 9వ తరగతు లకు ప్రవేశాల కోసం 24-06-2026న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది. ఎంపికైన అభ్యర్థుల జాబితా 25-06-2026న ప్రకటించబడుతుంది. సర్టిఫికేట్ పరిశీలన మరియు ప్రవేశాలు 26-06-2026న నిర్వహించబడతాయి.విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మిగిలిన ఖాళీలను స్థానిక మరియు స్థానికేతర అభ్యర్థుల నుండి నిబంధనల ప్రకారం భర్తీ చేయబడును.అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే https://apms.apcfss.in వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని కోరడమైనది.


## మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**బండి ఆత్మకూరు, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్):-** స్థానిక మోడల్ స్కూల్లో ఇంటర్ మొదటి సంవత్సరం, 7, 8, 9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సయ్యద్ అబ్బూర్ రాఫీ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. 2026, 27 విద్యా సంవత్సరానికి సంబంధించి పైన తెలిపిన తరగతుల్లో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 10వ తేదీ నుంచి 20వ తారీకు వరకు ఆన్లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 24వ తేదీన స్థానిక మోడల్ స్కూల్ నందు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన ఫలితాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

# పచ్చి రొట్టెతో భూమి సారవంతం

**- వ్యవసాయ శాస్త్రవేత్తలు**

## సోమయాజుల పల్లెలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం




**బండి ఆత్మకూరు, జూన్ 11, (రిపబ్లిక్ న్యూస్):-** రైతులు పంట పొలాల్లో జీలుగా పిల్లపెసర ,జనుము వంటి పచ్చిరొట్టె ఎరువులు చల్లుకోవడం వల్ల భూమికి తగిన పోషకాలు లభించి భూమి సారవంతం అవుతుందని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ మోహన్ విష్ణు వర్ధన్, డాక్టర్ సతీష్, నంద్యాల జిల్లా వనరుల కేంద్ర ఏడి చెన్నయ్య, ఆత్మ బిటిఎమ్ ఉమా మహేశ్వరి బండి ఆత్మకూరు మండలం వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సోమయాజుపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు ఖేత్ బచావో అభియాన్ - దర్తిమాత బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవన ఎరువులు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఆ తర్వాత వివిధ పంటల్లో విత్తన శుద్ధి ప్రాధాన్యత గురించి తెలిపారు. అధికంగా రసాయన ఎరువులు వాడడం వలన చీడపీడలు తెగుళ్ళు సోకే ప్రమాదం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. వేప సంబంధిత నూనెలను పంట తొలి దశల్లో పిచికారి చేయడం వలన పురుగు గుడ్లు లార్వా దశలను నశింప చేయొచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువులైన జనుము జీలుగా పిల్లి పెసర వంటి పంటలను ఒక ఎకరాకు 10 కిలోల చొప్పున చల్లి, 45 రోజులు తర్వాత పొలంలోనే దున్ని వేయడం వలన సుమారు 15 నుండి 20% పోషకాలు భూమికి లభ్య అవ్వడమే కాకుండా కర్బనం కూడా పెరిగి సూక్ష్మజీవులు వానపాములు పెరిగి భూమి గుల్ల బారుతుందని తెలిపారు. ఆ తర్వాత భూమి పరీక్ష చేయించుకోవాలని భూసార పరీక్షల ఆధారంగా వివిధ పంటల్లో సిఫారసు మేరకు సమతుల్య ఎరువులు వేసుకోవాలని తద్వారా భూమి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు.ఈ సంవత్సరం ఎల్నినో వర్షాభావ పరిస్థితి వచ్చే అవకాశం ఉంది కాబట్టి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా తక్కువ నీటి వాడుకునే అపరాల పంటలు, కొర్ర సజ్జ ఆముదం రాగులు నువ్వులు వంటి పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.

**యాప్ ద్వారా చీడపీడల నిర్ధారణ :** వ్యవసాయ శాఖ కొత్తగా చీడపీడలను గుర్తించే ఏపీఏఐఎంఎస్ ఆప్ రైతుల మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవచ్చని రైతే స్వయంగా చీడపీడల నిర్ధారణ చేసుకొని వ్యవసాయ శాఖ సూచనలు నివారణ చర్యలు యాప్ ద్వారా సకాలంలో సరైన పురుగు తెగుళ్ళ మందు సరైన మోతాదులో ఉపయోగించాలని సూచించడం జరిగినది.ఈ కార్యక్రమానికి వారితోపాటు ఓంకారం దేవస్థానం చైర్మన్ చేన్నారెడ్డి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది హుస్సేనమ్మ నాన్కీ బాయ్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆశీర్వాదం,ఈశ్వరయ్య మహేంద్ర లక్ష్మీ సౌజన్య తదితర రైతులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయమే రైతు భవిష్యత్తు.. పశుసంపదతో అధిక దిగుబడులు సాధ్యం: కలెక్టర్ డా. ఏ.సిరి

**గూడూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన రైతుల విజయగాథలను ఇతరులకు చేరవేయాలని అధికారులకు ఆదేశం**









**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 11)**

ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారవంతం కావడంతో పాటు రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యత కలిగిన దిగుబడులు సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి పేర్కొన్నారు. గూడూరు మండలంలోని రైతులు శేఖర్, రామకృష్ణ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలాలను ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రసాయన ఎరువులపై అధిక ఆధారపడటం వల్ల రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని, దీనికి ప్రత్యామ్నాయంగా పశు సంపద ఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఆవులు, గొర్రెలు, మేకల ద్వారా లభించే పేడ సహజ ఎరువుగా ఉపయోగపడి నేల సారాన్ని పెంచుతుందని తెలిపారు. యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని రైతులకు సూచించారు.

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు శేఖర్ తన అనుభవాలను కలెక్టర్‌కు వివరించారు. కేవలం రూ.4 వేల పెట్టుబడితో ప్రారంభించిన సాగులో మెంతికూర, కొత్తిమీర విక్రయాల ద్వారానే పెట్టుబడి తిరిగి వచ్చిందని, గోరుచిక్కుడు మరియు ఇతర అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. గోరుచిక్కుడు పంట ద్వారా రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఆదాయం సాధ్యమవుతుందని చెప్పారు.

అనంతరం రైతు రామకృష్ణ పొలాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ అమలు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని పరిశీలించి నీటి వినియోగం, పెట్టుబడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల విజయగాథలను గ్రామ స్థాయిలో ప్రచారం చేసి మరింత మంది రైతులను ఈ విధానంలోకి తీసుకురావాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

**ఎరువుల దుకాణంపై ఆకస్మిక తనిఖీ**

గూడూరు మండలంలోని మన గ్రోమోర్ యూరియా దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ఎరువుల సరఫరా చేయాలని సూచించారు. ఏపీఐఎంఎస్ యాప్ ద్వారా రైతుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి, యాప్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, గూడూరు తహశీల్దార్ వెంకటేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# కార్యకర్త సంక్షేమమే పార్టీ లక్ష్యం

**మానవత్వం చాటిన వైఎస్సార్‌సీపీ నేతలు**

**పరామర్శించిన తలారి రంగయ్య, ఉమామహేశ్వర నాయుడు**



**అనంతపురం / కంబదూరు క్రైమ్, జూన్ 11,(రిపబ్లిక్ న్యూస్):**
అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను పార్టీ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం గుద్దిళ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పిట్టి తిమ్మరాయుడు అనారోగ్య కారణాలతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి గురువారం ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా తిమ్మరాయుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నాయకులు ధైర్యం చెప్పారు. వైద్య చికిత్సకు అవసరమైన సహాయంగా డాక్టర్ తలారి రంగయ్య రూ.5 వేలు, ఉమామహేశ్వర నాయుడు రూ.5 వేలు అందజేసి మొత్తం రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ములుకునూరు తిమ్మరాయుడు, జడ్పీటీసీ సభ్యుడు నాగరాజు, ఎంపీపీ భీమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తలారి సత్యప్ప, మాజీ సర్పంచులు బాపూజీ, హరినాథ్, గోవిందప్ప, జిల్లా రైతు విభాగం కార్యదర్శి గాజుల రామాంజనేయులు, బయన్న, చిన్నన్న, గంగాధర్, రవి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# అనంతను హరిత నగరంగా తీర్చిదిద్దాలి

**ప్రతి ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటాలి**

**పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు**

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కాలుష్యంపై ఆందోళన**

**అనంతపురం ప్రతినిధి, జూన్ 11,(రిపబ్లిక్ న్యూస్):**
నగరంలో ఖాళీ గల ప్రదేశాలలో మొక్కలు నాటి పెంచాలని పర్యావరణవేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు కోరారు. ఎండాకాలంలో నగరం నిప్పుల కుంపటిగా మారుతోందనిజీవించడానికి కష్టంగా మారుతోందని పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్య స్థాయి పెరిగి నగరవాసుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ప్రముఖ పర్యావరణవేత్త రాజయోగి డాక్టర్ భాస్కర్ నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. నగర పరిధిలోని అన్ని ఖాళీ ప్రదేశాలను గుర్తించి భారీ స్థాయిలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని డాక్టర్ భాస్కర్ నాయుడు గురువారం నగర పాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు.

**పచ్చని ప్రణాళికలు .. కాగితాలకే పరిమితం**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో అనేక ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలు నిరుపయోగంగా ఉండగా, వాటిని హరితవనాలుగా మార్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. చెట్ల కొరత కారణంగా ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా వాయు కాలుష్యం కూడా అధికమవుతోందన్నారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే హరితాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వివరించారు. నియమ నిబంధనల ప్రకారం మున్సిపల్ ఆదాయంలో 15 నుంచి 20 శాతం వరకు మొక్కల పెంపకం, పార్కుల అభివృద్ధి, హరిత ప్రాజెక్టులకు వెచ్చించాలని సూచించారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తే నగరంలో ఉష్ణోగ్రతలను తగ్గించడంతో పాటు ప్రజలకు అవసరమైన ఆక్సిజన్ సమతుల్యతను అందించవచ్చని చెప్పారు.



**హరితాభివృద్ధి లేక .. నగరం అగ్నిగుండం**

గతంలో కొంతమంది అధికారులు హరితాభివృద్ధి అంశాన్ని నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రస్తుతం నగరం తీవ్ర వేడి సమస్యను ఎదుర్కొంటోందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఖాళీ స్థలాలను పచ్చదనంతో నింపేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు అమలు కాకపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కొనసాగితే మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అధికారులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే అనంతపురాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దగలమని డాక్టర్ భాస్కర్ నాయుడు అన్నారు. ఇప్పటికైనా ప్రకృతిని పరిరక్షించడానికి శ్రద్ధ చూపాలని భాస్కర్ నాయుడు కోరారు.

# సమర్థ పారిశుద్ధ్య నిర్వహణతోనే స్వచ్ఛ నగర లక్ష్యం సాధ్యం

**: కమిషనర్ చల్లా ఓబులేసు - ప్రజల సంతృప్తే ప్రాధాన్యం తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు అన్న క్యాంటీన్‌లో సిబ్బంది కొరతపై ఆగ్రహం**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 11)**
నగరంలోని పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టడం ద్వారా స్వచ్ఛ నగర లక్ష్యాన్ని సాధించవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. 15వ శానిటేషన్ డివిజన్ మస్టర్‌ను తనిఖీ చేసిన ఆయన, అనంతరం వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అలాగే తాగునీటి సమస్యలపై అధిక ఫిర్యాదులు వస్తున్న నిర్మల్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించి పారిశుద్ధ్య సేవలను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి వారి సంతృప్తి స్థాయిని పెంచాలని ఆదేశించారు. ప్రతి సచివాలయ పరిధిలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, ఇంటింటి చెత్త సేకరణను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు.
అదనంగా అవసరమైన సామగ్రి, కార్మికులను అందిస్తామని హామీ ఇచ్చిన కమిషనర్, నగర పరిశుభ్రతలో ప్రజల సహకారం అభినందనీయమన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా నగరపాలక సంస్థపై విశ్వాసాన్ని మరింత పెంచవచ్చని తెలిపారు. అనంతరం పరిమళ నగర్ అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కమిషనర్, అక్కడ కేవలం ఒక్క సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్న విషయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మ్యాన్‌పవర్ సప్లయర్ సూపర్వైజర్‌కు ఫోన్ చేసి సిబ్బంది నియామక విధానంలో తక్షణ మార్పులు తీసుకురావాలని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీఈ నరేష్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ శాలిబాష తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల సబ్ డివిజన్ లోని పలు పోలీస్ స్టేషన్ ల ఆకస్మిక తనిఖీ

**ప్రజల రక్షణ ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలి**

**శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేయండి - జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**







**నంద్యాల క్రైం, జూన్ 11, ( న్యూస్):**
జిల్లా సునీల్ షోరాణ్ గురువారం నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నంద్యాల టూ టౌన్, త్రీ టౌన్ తాలూకా పోలీస్ స్టేషన్లు, పోలీస్ కంట్రోల్ రూమ్ మరియు గోస్పాడు పోలీస్ స్టేషన్లను ఆయన సందర్శించి పలు రికార్డులు పరిశీలించడంతో పాటు జరుగుతున్న విధులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలోని స్టేషన్ డైరీ, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితి, రాత్రి వేళల్లో గస్తీ (పెట్రోలింగ్) నిర్వహణ, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచాలని, నేరాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కంట్రోల్ రూమ్ పనితీరును పరిశీలించి, అత్యవసర సమయాల్లో స్పందించే వేగాన్ని మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. సీసీ కెమెరాల పనితీరు, 112 కాల్స్ పై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై నిబద్ధతతో పనిచేయాలని అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల రక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని, విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అదనపు డీఎంఈ ఆకస్మిక తనిఖీ

**నిర్మాణ పనులు, వైద్య పరికరాల పనితీరుపై సమీక్ష పారిశుద్ధ్య లోపాలపై అసంతృప్తి**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 11)**
కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని అదనపు డీఎంఈ డా. సత్యనారాయణ మూర్తి సందర్శించి ఆసుపత్రిలోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల పనితీరును సమీక్షించిన ఆయన, నూతన డయాగ్నొస్టిక్ బ్లాక్‌లో మూడో, నాలుగో అంతస్తుల్లో కొనసాగుతున్న సివిల్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను పరిశీలించిన డా. సత్యనారాయణ మూర్తి, వాటి వినియోగం, పనితీరుపై సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న అత్యవసర వైద్య పరికరాలు, వాటి ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై సమగ్ర సమాచారం సేకరించారు.
పరిశీలనలో భాగంగా ఆసుపత్రి ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో డస్ట్‌బిన్‌లకు కవర్లు, బ్లూ డస్ట్‌బిన్లు లేకపోవడాన్ని గమనించిన ఆయన, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. తదుపరి కర్నూలు మెడికల్ కళాశాలను సందర్శించిన ఆయన, కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను చాటారు. అలాగే కళాశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల విస్తరణ, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, ఆసుపత్రి పరిపాలన అధికారులు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్‌కే యోగా టీమ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు





**అనంతపురం/ గుత్తి జూన్11 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి కోట రైల్వే స్టేషన్ సమీపంలోని సాయి స్పోర్ట్స్ యూనిట్ తైక్వాండో అకాడమీలో ఆర్‌కే యోగా టీమ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జబ్బార్ మియా, విజయభాస్కర్, కృష్ణయ్య, రాంబాబు, ఇసుకాల గోపాల్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆర్‌కే యోగా మాస్టర్లు కృష్ణయ్య, రామకృష్ణ దాదాపు గంటసేపు వివిధ యోగాసనాలు చేయించి వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ జబ్బార్ మియా మాట్లాడిన యోగా వల్ల ఆరోగ్య ప్రయోజనాలతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. యోగా ద్వారా పని ఒత్తిడి తగ్గి రోజంతా ఉత్సాహంగా, చురుకుగా ఉండగలమని చెప్పారు. సాయి తైక్వాండో అకాడమీ విద్యార్థులు కరాటేతో పాటు యోగాను కూడా ప్రతిరోజూ అలవాటు చేసుకోవాలని, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను తమ తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ మాట్లాడుతూ ఈ నెల 20న గుత్తి కోటలో నిర్వహించనున్న యోగా కార్యక్రమాన్ని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగా గురువు కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా సాధన చేస్తే ఆరోగ్యం మెరుగుపడి ఆసుపత్రులకు వెళ్లే అవసరం చాలా వరకు తగ్గుతుందని అన్నారు. ప్రతి రోజు ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు గుత్తి పట్టణంలోని కోర్టు రోడ్డులో ఉన్న విశ్రాంతి సైనిక భవన్‌లో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి స్పోర్ట్స్ యూనిట్ తైక్వాండో అకాడమీ అధినేత సాయి, గుత్తి కోట గైడ్ మరియు చరిత్ర అధ్యాపకుడు రమేష్, ఇన్‌స్టాగ్రామ్ బ్లాగర్ ప్రియాంక, డాన్సర్ రాజేష్, మునిసిపల్ ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది, సంరక్షణ సమితి సోషల్ మీడియా కన్వీనర్ శివ, ఆటో యూనియన్ నాయకుడు నజీర్, తైక్వాండో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# తనిష్క్ అంటేనే భారతీయుల విశ్వాసం

**వైసిపి మహిళ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ వి. విజయ మనోహరి**

**సస్య ఫ్రైడ్ నందు తనిష్క్ వజ్రాభరణాల ప్రదర్శన**

**దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆభరణాలను అందుబాటులోకి**




**కర్నూలు ప్రతినిధి, జూన్ 11(రిపబ్లిక్ న్యూస్)**
తనిష్క్ అంటేనే భారతీయుల విశ్వాసానికి.. నమ్మకానికి మారు పేరుగా నిలుస్తుందని వైసిపి మహిళ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ వి. విజయ మనోహరి తెలిపారు.
వజ్రాభరణాల ప్రియులు మంచి కలెక్షన్లు పొందాలనుకునే వారి కోసం స్థానిక సస్య ఫ్రైడ్ నందు తనిష్క్ వజ్రాభరణాల ప్రదర్శన పేరుతో మూడు రోజులపాటు అందుబాటులోకి తెచ్చినట్లు వైసిపి మహిళ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాం విజయ మనోహరి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టాటా కంపెనీ అంటేనే నమ్మకమని.. వారి మరో ఉత్పాదన తనిష్క్ డైమండ్ జువెలరీస్ అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా తనిష్ షోరూమ్ నందు కాకుండా మొదటిసారిగా వజ్రాభరణాల ప్రదర్శన ఏర్పాటు చేసి.. దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆభరణాలను అందుబాటులోకి తీసుకొచ్చిన సస్య, కిరణ్ లను ప్రత్యేకంగా అభినందించారు. వజ్రాభరణాల ప్రియులు ఎగ్జిబిషన్ సందర్శించి అవసరమైన మంచి కలెక్షన్ కొనుగోలు చేయాలని పిలుపు నిచ్చారు. వజ్రాభరణాల ఎగ్జిబిషన్ నందు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వాటిని అందుబాటులో ఉంచడమేప్రత్యేకత అని తనిష్క్ షోరూం మేనేజర్ ప్రవీణ్ కుమార్ చెప్పారు.
అత్యంత విలువైన ఆభరణాల ప్రదర్శన ను కర్నూలు నగర ప్రజలు, జిల్లా వాసులకు అందుబాటులోకి తెచ్చినట్లు మేరీ తెలిపారు . ఈనెల 11,12,13 తేదీల నందు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, వజ్రాభరణాల ప్రియులు సందర్శించి కొనుగోలు చేయాలని కోరారు. పాత బంగారు ఆభరణాలు మార్పు చేసుకొని కూడా ఆభరణాలు కొనుగోలు చేసే సదుపాయం ఉందని చెప్పారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అంతకుముందు సస్య, స్టోర్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, పుర ప్రముఖులు, మహిళా నేతలతో కలసి వాం విజయ మనోహరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శన ప్రారంభించారు.

# ఏపీ ఎన్జీవోఎస్ రాష్ట్ర నాయకులకు ఘన స్వాగతం

## కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి

## ఏపీ ఎన్జీవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

**అనంతపురం క్లాక్ టవర్, జూన్ 11,(రిపబ్లిక్ న్యూస్):**
పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం, ఉద్యోగుల సంక్షేమం, సేవా హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎన్జీవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాకు విచ్చేసిన ఆయనను, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణను ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై వినతిపత్రం సమర్పించారు.


**పథకాల అమలులో కార్యదర్శుల పాత్ర కీలకం**
ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిపాలనా, సేవా సంబంధిత ఇబ్బందులు, అదనపు విధుల భారం, పదోన్నతుల ఆలస్యం, ఖాళీ పోస్టుల భర్తీ, ఉద్యోగ భద్రత, వేతనాలకు సంబంధించిన అంశాలను రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పంచాయతీ కార్యదర్శుల పాత్ర అత్యంత కీలకమని, అయినప్పటికీ వారికి తగిన గుర్తింపు, సౌకర్యాలు అందడంలేదని ప్రతినిధులు వివరించారు.
ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి అంశాలను తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని విద్యాసాగర్ హామీ ఇచ్చారు. ప్రతి ఉద్యోగి సంక్షేమం కోసం ఏపీ ఎన్జీవోఎస్ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సేవా నిబంధనల అమలు, పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేయడం వంటి అంశాలపై సంఘం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా సంఘం అన్ని స్థాయిల్లో ప్రయత్నాలు కొనసాగిస్తోందన్నారు.



గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి**
ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందన్నారు. ఉద్యోగుల హక్కులు, సేవా ప్రయోజనాల సాధన కోసం సంఘం ప్రభుత్వంతో చర్చలు జరుపుతోందని తెలిపారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సమాఖ్య నాయకులు రాఘవ, సురేష్, ఈశ్వర్, మల్లికార్జున, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర నాయకులతో జరిగిన భేటీ సానుకూల వాతావరణంలో సాగిందని, పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి ఇది దోహదపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**నంద్యాల, జూన్ 11:**
నంద్యాల టౌన్ 32వ వార్డు పరిధిలోని ఊడుమాల్పురంలో "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ ఎన్ఎండి ఫరూక్, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ జి.సూరజ్ ధనుజయ్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ లబ్ధిదారులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను స్వయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి రైతుకు భూమిపై పూర్తి హక్కులను కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, పారదర్శకమైన విధానంలో ఈ పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ పట్టాదారు పాస్ పుస్తకాల ద్వారా రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సులభంగా పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, ఎమ్మార్వో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శేషన్న, నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి , 32వ వార్డు ఊడుమాల్పురం టిడిపి ఇంచార్జి కళ్యాణ్, జ్వాలా తిరుమలేష్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు

## --జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 11 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
గురువారం శివంపేట మండల కేంద్రంలోని ఉసిరిక పల్లి గ్రామంలో పోతరాజుల బాలేష్ అనే రైతు తన నాలుగున్నర ఎకరాల పొలంలో సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పంటలను ,సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులు సాగు చేస్తున్న పంటలను జిల్లా కలెక్టర్ నేడు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.రైతులు తయారు చేస్తున్న జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్, సేంద్రియ కషాయాలు తదితర సహజ ఎరువులు తయారీ విధానాలను కలెక్టర్ పరిశీలించారు. పంటల ఎదుగుదల, దిగుబడి పరిస్థితులు, సాగు ఖర్చులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మరింత ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.
వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తూ సేంద్రియ సాగును విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు), రైతు వేదికల ద్వారా సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఆదర్శ సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేసి ఇతర రైతులకు ప్రేరణ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు ధృవీకరణ (సర్టిఫికేషన్), బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించి సేంద్రియ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ సేంద్రియ వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం అత్యంత అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, సాంకేతిక వ్యవసాయ అధికారి యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారిణి సౌజన్య మరియు రైతులు పాల్గొన్నారు.

# సాహిత్య, సామాజిక రంగాలకు తీరని లోటు

## కంబదూర్ షేక్ నబి రసూల్‌కు ఘన నివాళి -నివాళులర్పించిన కుటుంబ సభ్యులు, రచయితలు

**అనంతపురం ప్రతినిధి, జూన్ 11,(రిపబ్లిక్ న్యూస్ ):**
ప్రముఖ కవి, రచయిత, సామాజిక కార్యకర్త కంబదూర్ షేక్ నబి రసూల్ (74) మృతి సాహిత్య, సామాజిక రంగాలకు తీరని లోటని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కంబదూర్ నబిరసు అనారోగ్య కారణాలతో బుధవారం అర్ధరాత్రి ఆయన కన్నుమూశారన్నారు.

**సేవాభావంతో చిరస్మరణీయుడైన కంబదూర్ నబి రసూల్**
1972 నుంచి 2003 వరకు రాష్ట్ర విద్యుత్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన నబి రసూల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా కళ్యాణదుర్గంలో పదవీ విరమణ పొందారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సాహిత్య, నాటక రంగాల పట్ల అపారమైన అభిరుచిని పెంపొందించుకున్నారు. రంగస్థలంపై బస్మాసురుడి పాత్రను సమర్థంగా పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు."కమ్మని కంఠం నాకు లేదు", "నిత్య నవనీతం నబి రసూల్



సుభాషితం" వంటి గ్రంథాల ద్వారా సాహిత్యాభిమానులను అలరించారు. జిల్లా రచయితల సంఘంలో దాదాపు మూడు దశాబ్దాలపాటు శాశ్వత సభ్యుడిగా, వివిధ హోదాల్లో సేవలందించారు.
సాహిత్యంతో పాటు సామాజిక సేవలోనూ ఆయన ప్రత్యేక ముద్ర వేశారు.

**కులమతాలకు అతీతంగా సేవలందించిన మానవతావాది**
కరోనా విపత్తు సమయంలో రెడ్‌జోన్ ప్రాంతాల్లో పర్యటించి ఆహారం, కూరగాయలు, మాస్కులు పంపిణీ చేశారు. జమీయత్ ఉలేమా ఆధ్వర్యంలో ముస్లిం నిరుపేదల గణాంకాలు సేకరించి, పేద విద్యార్థులకు విద్యా సహాయం, నిరాశ్రయ మహిళలకు జీవనోపాధి కల్పించే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు.కుల, మత భేదాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన మానవతావాది నబి రసూల్ అని పలువురు కొనియాడారు. ఆయన పార్థివదేహానికి కవులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు నివాళులర్పించారు. "కంబదూర్ షేక్ నబి రసూల్ జోహార్" అంటూ నినాదాలు చేస్తూ తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత డాక్టర్ శాంతినారాయణ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, తెలుగు వెలుగు సంస్థ అధ్యక్షుడు టీవీ



మృతి చెందిన కంబదూర్ నబి రసూల్

రెడ్డి, ఉమర్ అలీషా సాహిత్య సమితి అధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్, రచయితలు డాక్టర్ గిరిధర్‌రాయ్, డాక్టర్ అంకె రామలింగయ్య, డాక్టర్ జూటూరు షరీఫ్, గుడిపాటి సూర్యం, సామాజిక సేవకులు ఎర్రగుంట్ల కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, బాలన్న, హెచ్. నాగలింగమయ్య, దాసన్నగారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నీరు ఉన్నా .. నోరు తడవని దుస్థితి

## కరెంట్ లేక 15 రోజులుగా బోరు బంద్ - తాండలో తాగునీటి కోసం ప్రజల అవస్థలు

**అనంతపురం/కంబదూరు క్రైమ్,జూన్ 11,(రిపబ్లిక్ న్యూస్):**
కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలంలోని పి.వెంకటంపల్లి తాండ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. గ్రామంలో పుష్కలంగా భూగర్భ జలాలు ఉన్నప్పటికీ, బోరుకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. గత 15 రోజులుగా గ్రామంలోని రెండు బోర్లలో ఒకటి మాత్రమే పనిచేస్తుండటంతో పలు కాలనీలకు తాగునీరు అందడం లేదు.

**కనెక్షన్‌ను తొలగించడంతో బోరు పూర్తిగా నిలిచిపోయింది.**
గ్రామంలో మరో బోరులో సమృద్ధిగా నీరు లభిస్తున్నప్పటికీ, దానికి శాశ్వత విద్యుత్ కనెక్షన్ లేకపోవడం సమస్యగా మారింది. కొంతకాలంగా ఓ రైతు తన విద్యుత్ కనెక్షన్‌ను అందించి గ్రామస్తులకు సహకరించాడు. ఆ విద్యుత్‌తో బోరు మోటార్ పనిచేసి ప్రజల నీటి అవసరాలు



తీరాయి.అయితే ఇటీవల అనివార్య కారణాలతో రైతు తన కనెక్షన్‌ను తొలగించడంతో బోరు పూర్తిగా నిలిచిపోయింది.
దీంతో తాగునీటి కోసం మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని కాలనీల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు, సంబంధిత ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా స్పందన కరువైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నీరు అందని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి**
ఈ అంశంపై ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప స్పందిస్తూ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై అధికార యంత్రాంగం వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. బోరుకు శాశ్వత విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసి, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నీరు అందని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.సమస్యను వెంటనే పరిష్కరించకపోతే గ్రామ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. నీరు ఉన్నా విద్యుత్ లేక ప్రజలు దాహంతో అలమటిస్తున్న పరిస్థితిపై అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కూటమితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం





## ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**అనంతపురం/గుత్తి సంక్షేమం, జూన్ 11,(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామంలో గురువారం రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన డ్రైనేజీ కాలువను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో కలిసి తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, మార్కెట్ యార్డు చైర్మన్ సూర్య ప్రతాప్ లు ప్రారంభించారు.

**వైకాపా పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత వైకాపా పాలనలో గ్రామాలు అభివృద్ధికి దూరంగా, సమస్యలతో సతమతమయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాల అమలుకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. జక్కలచెరువు గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రూ.18 లక్షల వ్యయంతో డ్రైనేజీ కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మరిన్ని పనులను కూడా చేపడతామని హామీ ఇచ్చారు.మార్కెట్ యార్డు చైర్మన్ సూర్య ప్రతాప్ మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

**తెదేపాలోకి 20పైగా కుటుంబాలు భారీగా చేరికలు**
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైకాపాకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరారు.జక్కలచెరువు గ్రామంలో మార్కెట్ యార్డు చైర్మన్ సూర్య ప్రతాప్, ఎంపీటీసీ నారాయణస్వామి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 20కి పైగా కుటుంబాలు వైకాపా పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుమ్మనూరు ఈశ్వర్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించి, పార్టీ బలోపేతానికి వారి సేవలను వినియోగించుకుంటామని హామీ ఇచ్చారు.

**పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలి**
అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, అన్ని పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.పార్టీలో చేరిన శివశంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బద్రివలీ, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య, ఎంపీటీసీ నారాయణస్వామి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ శ్రీనివాసులు, రమేష్, రాజా, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, మాజీ సర్పంచ్ రామలింగమయ్య, మాజీ సర్పంచ్ చిదంబరం, నాగేంద్ర, నరేంద్ర, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మమత అరాచకాలకు కాంగ్రెస్ అండ !

**జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :**
మామూలు వావాయి చెప్పులు...ముతక చీర..చంకలో సంచీ వేసుకుని సామాన్య స్త్రీలా కనిపించే ఆహార్యంతో ..పదిహేనేళ్లపాటు బెంగాల్‌ను ఏలిని మమతా బెనర్జీ, ఆ రాష్ట్రాన్ని ఎంతమేరకు భ్రష్టు పట్టించాలో అంతగా భ్రష్టు పట్టించారు. ఏం సాధించారంటే ఏమీ లేదు. అధికారం కోసం ఎంతకైనా తెగించడం అలవాటు చేసుకున్నారు. సంసారం పిల్లలు లేరు. అయినా మేనల్లుడిని పెట్టుకుని బెంగాల్‌లో రాజ్యమేలారు. నందిగ్రామ్‌తో రాష్ట్రంలోకి పరిశ్రమలు రాకుండా అడ్డుకుని, ప్రజల్లో మంచి ఇమేజ్ సాధించి..అదే ప్రజలను రాచిరంపాన పెట్టిన రాక్షసిగా పేరుగడించారు. పదిహేనేళ్లుగా అధికార మదంతో తనకు తిరుగులేదనిపించారు. అన్నింటికి మించి భారత భద్రతకు విఘాతం కలిగించారు. పొరుగునే ఉన్న బంగ్లాదేశీయులు యధేచ్ఛగా బెంగాల్లోకి గోడదూకారు. ఇక్కడే తిష్టవేశారు. వారిని ఓటు బ్యాంకుగా మలచుకున్న మమత బెనర్జీ దేశానికి సవాల్ విసిరిన అక్రమ వలసదారుల ఆగడాలను గుర్తించలేదు. తనకు తిరుగులేదని భావించి అనరాచక పాలనకు తెరతీసారు. రేప్‌లు, మర్డర్లు, దోపిడీలు, దొమ్మీలు జరుగుతున్నా.. పట్టించుకోలేదు. సామాన్యులు భయంభయంగా బతికారు. బిజెపి దెబ్బతో ఇప్పుడు దిమ్మతిరిగి నేలమీద పడ్డారు. తన ఉనికికే సవాల్‌గా మారింది. దీంతో కాంగ్రెస్‌తో కాళ్బేరానికి వచ్చారు. అందుకే మమతాబెనర్జీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. టీఎంసీ సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన 3 రోజులకే మరో ఎంపీ సుష్మితా దేవ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం ఆమె అస్సాం సీఎం హిమంత శర్మతో




సమావేశమయ్యారు. త్వరలో ఆమె బీజేపీలో చేరతారని సమాచారం. అస్సాంకు చెందిన సుష్మితా దేవ్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సంతోష్ మోహన్ దేవ్ కుమార్తె. గతంలో ఆమె అస్సాంలోని సిల్చార్ నుంచి గెలుపొందారు. ఇకపై అస్సాంలోనే రాజకీయాలు చేస్తానని, బెంగాల్‌లో కాదని ఆమె స్పష్టం చేశారు. తాజాగా ప్రకాశ్ చిక్ బరైక్ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో అక్కడ దాదాపు టిఎంసి ఖాళీ అవుతోంది. నిజానికి ప్రాంతీయ పార్టీలు ఇంతగా దెబ్బతిన్న దాఖాలు ఏ రాష్ట్రం లోనూ లేవు. మమత మీద విశ్వాసం లేదంటే ఆమె ఎంతగా నియంతలా వ్యవహరించారో తెలిసిపోతోంది. ఇప్పటికే అసెంబ్లీలో ఎమ్మెల్యేలు వేరుకుంపటి పెట్టుకున్నారు. టీఎంసీకి చెందిన 19 మంది ఎంపీలు తిరుగుబాటు చేసి వేరుకుంపటి పెట్టుకున్నారు. ఈ బృందానికి టీఎంసీ సీనియర్ ఎంపీ కాకోలీ ఘోష్ నేతృత్వం వహిస్తున్నారు. దీదీకి అత్యంత విధేయంగా ఉన్న శత్రుఘ్న సిన్హా, యూసుఫ్ పఠాన్, సయాని ఘోష్ కూడా తిరుగుబాటు బృందంతో చేతులు కలిపారు. జగదీశ్ చంద్ర మసునియా, ఖలి ఉర్ రహమాన్, అబు తాహిర్ ఖాన్, పార్థ భౌమిక్, బాపి హల్దార్, మాలా రాయ్, మితాలీ బాగ్, దీపక్ అధికారి, కాలీపాద సొరేన్, జూన్ మాలియా, అరూప్ చక్రవర్తి, షర్మిలా సర్కార్, అసిత్ కుమార్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ కూడా తిరుగుబాటుదారుల బృందంలో ఉన్నారు. టీఎంసీకి లోక్‌సభలో 28 మంది సభ్యులుండగా 19 మంది రెబల్స్‌గా ప్రకటించుకున్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ శాసనసభకు ఇటీవల ఎన్నికైన 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేల్లో 64 మంది తిరుగుబాటు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లో చీలికలు, నేతల రాజీనామాల నేపథ్యంలో ఆ పార్టీని జాతీయ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత సోనియాగాంధీ ప్రతిపాదించినట్టు సమాచారం. మమతను దారికి తెచ్చుకోవడానికి, బెంగాల్లో కాలు మోపడానికి కాంగ్రెస్‌కు ఇదొక్కటే అవకాశం. అయితే ఈ ప్రతిపాదనపై స్పందించేందుకు కొంత సమయం కావాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కోరినట్టు సమాచారం. ఇటీవల జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ అధికారం కోల్పోయి, బీజేపీ పాలన ప్రారంభమైన దరిమిలా.. టీఎంసీలో అంతర్గత కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. మరోవైపు బీజేపీ నుంచి ఒత్తిళ్లు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేయడమే పరిష్కారమని సోనియా సూచించినట్టు తెలిసింది. మరోవైపు, అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ నేత రాహుల్‌తో భేటీ అయ్యారు.

టీఎంసీ అగ్రనేతలుగా ఉన్న వారు పార్టీపై తిరుగుబాటు జెండా ఎగరేయడంతో పాటు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతిస్తామని ప్రకటించారు. దీంతో పార్టీ భవితవ్యంపై మమత తల్లడిల్లుతున్నారు. భవిష్యత్తులో వచ్చే ఎన్నికల్లో ఏవిధంగా ముందుకు సాగాలన్నది మరింత ఇబ్బందికరంగా మారింది. 64 మంది ఎమ్మెల్యేలు.. రితబ్రత బెనర్జీ నేతృత్వంలో చీలిపోగా, 28 మంది ఎంపీల్లో 20 మంది కకోలీ ఘోష్ దస్తీదార్ నేతృత్వంలో విడిపోయి.. ఎన్డీయేకు మద్దతిస్తామని, తమను ప్రత్యేక సమూహంగా గుర్తించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖరాశారు. ఈ పరిణామాలతో టీఎంసీ పార్టీ మమత చేతుల్లోంచి జారిపోయే ప్రమాదం ఏర్పడింది. చీలిక వర్గాలకు 'గుర్తింపు' లభిస్తే.. పార్టీ గుర్తు, జెండా సహా టీఎంసీ ఆస్తులపైనా హక్కులు లభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ ఢిల్లీలో సోనియాగాంధీని కలుసుకుని సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం బుధవారం కూడా మరోసారి ఇరువురు భేటీ అయ్యారు. ఈ సందర్భంగానే సోనియాగాంధీ.. విలీన ప్రతిపాదనను మమత ముందు ఉంచారని టీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌లో విలీనం చేయడం ద్వారా బలమైన ప్రతిపక్షంగా బీజేపీని ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని ఆమె సూచించారని పేర్కొన్నాయి. టీఎంసీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే, మమతా బెనర్జీకి కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవితోపాటు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ప్రధాన కార్యదర్శి పదవులు ఇస్తామని సోనియాగాంధీ హామీ ఇచ్చినట్టు తెలిపాయి. ఈ ప్రతిపాదనపై తక్షణమే నిర్ణయం తీసుకోలేనని, కొన్ని రోజుల సమయం కావాలని మమత కోరినట్టు టీఎంసీ వర్గాలు వెల్లడించాయి.

టీఎంసీ విలీన ప్రతిపాదన వార్తలపై బెంగాల్ కాంగ్రెస్ విభాగం సీనియర్ నాయకులు తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. అక్రమార్కులు, అన్యాయాలు చేసిన పార్టీని కాంగ్రెస్‌లో ఎలా కలుపుకొంటారని నిలదీస్తున్నారు. అధికారికంగా దీనిపై ప్రకటన వచ్చాక తమ నిర్ణయం వెల్లడిస్తామని కొందరు నేతలు తెలిపారు. దీంతో కాంగ్రెస్‌కు కూడా చిక్కులు తప్పేలా లేవు. గతంలో కాంగ్రెస్ పార్టీతోనే రాజకీయాల్లోకి ప్రవేశించిన మమత.. 28 ఏళ్ల కిందట 1998లో కాంగ్రెసతో విభేదించి తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. వరుసగా మూడు సార్లు బెంగాల్ ఎన్నికల్లో విజయం దక్కించుకుని అధికారంలోకి వచ్చారు.

అయితే ఆమె పార్టీని కూడా సరిగా నడపలేరని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఎన్నో అక్రమాలు చేఇవుంటే తప్ప ఇప్పుడు బిజెపికి భయపడాల్సిన అవసరం లేదు. కానీ అరాచక పాలన సాగించిన పాపానికి ఆమెకు భవిష్యత్ ఉంటుందా అన్నది అనుమానమే.

# నామినేషన్ తిరస్కరణ వ్యవహారం

### సుప్రీంకోర్టులో మీనాక్ష నటరాజన్ పిటిషన్ -నేడు విచారణ చేస్తామని చెప్పిన సుప్రీం

**న్యూఢిల్లీ, జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) ::** మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైన క్రమంలో.. ఈ అంశంపై తక్షణమే విచారణ చేపట్టాలని మీనాక్షి గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. మీనాక్షీ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తున్నారు. తప్పుడు రీతిలో మీనాక్షి నామినేషన్‌ను తిరస్కరించినట్లు ఆయన కోర్టుకు తెలిపారు. కానీ రాజ్యసభ ఎన్నిక ప్రక్రియ ముగిసిన తర్వాతే ఎలక్షన్ పిటీషన్ నమోదు చేయాలని మీనాక్షికి సుప్రీంకోర్టు చెప్పినట్లు తెలుస్తోంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణకు ఆమోదించింది. మధ్యప్రదేశ్‌లో మూడు రాజ్యసభ సీట్ల కోసం జూన్ 18వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అయితే మంగళవారం అనూహ్య పరిణామం చోటుచేసుకున్నది. మధ్యప్రదేశ్ రాజ్యసభ



ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరవింద్ శర్మ అకస్మాత్తుగా మీనాక్షీ నటరాజన్ పిటీషన్‌ను తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి జలక్ తగిలింది. మీనాక్షి అసంపూర్ణంగా డాక్యుమెంట్లు సమర్పించినట్లు అరవింద్ శర్మ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. తనపై కోర్టు కేసు ఉన్న విషయాన్ని ఆమె ఫామ్ 26లో పొందుపరచలేదని ఆర్వో తెలిపారు. 2025 అక్టోబర్‌లో హైదరాబాద్ కోర్టుకు నోటీసుకు నటరాజన్ స్పందించారని, కానీ ఫామ్ 26లో ఈ విషయాన్ని చెప్పలేదని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. తెలంగాణలో మీనాక్షిపై కేసు నమోదు అయ్యిందని బీజేపీ అభ్యర్థి మహేశ్ కేవత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జూన్ 8వ తేదీన నామినేషన్ ఫైలింగ్‌కు చివరి తేది. మంగళవారం రోజున ఆ పేపర్లను స్క్రూటినీ చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నాటరాజన్ తన నామినేషన్‌ను తిరస్కరించినందుకు సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టాలని ఆమె కోర్టును కోరారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ

జరపనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రాజ్యసభ ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ నుంచి మీనాక్షి నటరాజన్ జూన్ 9వ తేదీన నామినేషన్ దాఖలు చేశారు. మీనాక్షి నటరాజన్ ప్రస్తుతం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) నుంచి తెలంగాణ ఇన్‌ఛార్జీగా ఉన్నారు.

# కవిత టిఆర్ఎస్ పార్టీకి చిక్కులు

### పార్టీ గుర్తింపుపై ఇసికి అభ్యంతరాలు

**న్యూఢిల్లీ, జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :**
ఎమ్మెల్సీ కవిత కొత్త రాజకీయ పార్టీ పేరు చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. 'తెలంగాణ రక్షణ సేన' టిఆర్ఎస్ పార్టీకి ఊహించని అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ పేరుపై ఇప్పటికే పలు అభ్యంతరాలు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కవిత పార్టీ



ప్రకటనకు ముందే మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్రసామాజిక సేన' కూడా 'టీఆర్ఎస్' అనే పేరు తమ పార్టీకి కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు కవిత పార్టీ ప్రకటనకు ఒక రోజు ముందే ఈసీఐకి దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ఇక కవిత పార్టీ పేరుపై భారత్ రాష్ట్ర సమితి కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 14 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో 'టిఆర్ఎస్ అనే పేరు తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను 'టీఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని పేర్కొంటూ ఆ పేరును ఇతరులకు కేటాయించవద్దని ఈసీఐకి అధికారిక ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా, కవిత పత్రికల్లో ఇచ్చిన ప్రకటనపై కూడా పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. టిఆర్ఎస్ పేరును కేటాయించడంపై దాదాపు 600 నుంచి 700 వరకు ప్రజా అభ్యంతరాలు ఎన్నికల సంఘానికి అందినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఇప్పటికే '÷ఖా' పేరుతో నమోదైన మరికొన్ని రాజకీయ పార్టీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో రాజకీయ పార్టీ కూడా టిఆర్ఎస్ పేరును ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు కవిత ప్రతినిధుల బృందం కూడా ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. భారీ సంఖ్యలో అభ్యంతరాలు వ్యక్తమవుతుండటంతో కవిత కొత్త రాజకీయ పార్టీకి 'టీఆర్ఎస్' పేరు దక్కుతుందా లేదా అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# వైజాగ్ స్టీల్ ప్లాంట్ లో మరో ప్రమాదం.. తప్పిన ముప్పు



**విశాఖపట్నం జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :**
విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో వరుసగా జరుగుతున్న ఘటనలు కార్మికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. మూడు రోజుల క్రితం జరిగిన భారీ ప్రమాదంలో 9 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన విషాదం ఇంకా మరువక ముందే.. ఈ తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో ప్లాంట్‌లో మరో ప్రమాదం చోటుచేసుకుంది. భారీ ప్రమాదం త్రుటిలో తప్పింది. ఎస్ఎమ్ఎస్-1 విభాగంలోని ఆర్గాన్ రిన్సింగ్ స్టేషన్ వద్ద లాడిల్ నుండి ద్రవ ఉక్కు ఒక్కసారిగా లీకైంది. అయితే, లీకేజీ జరిగిన సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో మరో పెద్ద ప్రాణ నష్టం, ముప్పు తప్పినట్లయింది.

కేవలం మూడు రోజుల వ్యవధిలోనే అలాంటి ఘటన పునరావృతం కావడంతో స్టీల్ ప్లాంట్ కార్మికులు, కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జూన్ 8న ఎస్ఎమ్ఎస్-2 విభాగంలో లాడిల్ నుండి ద్రవ ఉక్కు పొంగిపొర్లడం వల్ల 9 మంది అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. పలువురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మరణాల నేపథ్యంలో ఇప్పటికే కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలకు భారీ ఎక్స్‌గ్రేషియా అందించింది. మృతుల కుటుంబాల్లో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

# సిబిఎస్ఇ ఆన్ స్క్రీనింగ్ లోపాలు

### బయటపెట్టిన 19 ఏళ్ల కుర్రాడు

### ఏకంగా కాన్పూర్ ఐఐటిలో జాబ్

**కాన్పూర్, జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** సీబీఎస్ఈ ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ లోపాలను బయటపెట్టిన యువతలో 19 ఏళ్ల నిసర్గ అధికారి కూడా ఒకరు. తాజాగా అతడిని ఐఐటీ కాన్పూర్ నియమించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తమ సైబర్ డిఫెన్స్ రీసెర్చ్ సెంటర్ నిసర్గ అధికారిని ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్, థ్రెట్ ఇంటెలిజెన్స్





ఇంజినీర్‌గా నియమిస్తున్నట్లు ఐఐటీ కాన్పూర్ వెల్లడించింది. దీనిపై ఈ విద్యాసంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ మహీంద్ర అగర్వాల్ మాట్లాడుతూ.. 'నిసర్గ అధికారి ఎంతో నైపుణ్యం ఉన్న యువ ఇంజినీర్. అతడికి చిన్న వయసులోనే అద్భుతమైన సాంకేతిక సామర్థ్యాలున్నాయి. ఈ నియామకంతో సైబర్ సెక్యూరిటీ రంగంలో అతడికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి. దీంతోపాటు మా విభాగం కూడా బలోపేతం అవుతుందని భావిస్తున్నాం. గతంలోనూ మా సైబర్ విభాగంలో ఇలా యువ ఇంజినీర్లను నియమించుకున్నాం అని వెల్లడించారు. కాంట్రాక్టు విధానంలో అతడిని ఐఐటీ కాన్పూర్ నియమించుకున్నట్లు యాజమాన్యం తెలిపింది. అయితే, అతడి వేతనం, ఇతర వివరాలను విద్యాసంస్థ వెల్లడించలేదు.నిసర్గ అధికారి ఈ ఏడాదే 12వ తరగతి పూర్తిచేశాడు. అతడి కుటుంబంలో ఎవరూ సైబర్ సెక్యూరిటీ రంగంలో లేరు. తల్లిదండ్రులిద్దరూ ఫైనాన్స్ రంగంలో పనిచేస్తున్నారు. కోడింగ్ మీదున్న ఆసక్తితో ఆరేళ్ల వయసు నుంచే దాన్ని నేర్చుకోవడం మొదలుపెట్టాడు. ఆరోతరగతికి వచ్చాక.. సైబర్ సెక్యూరిటీపై దృష్టిపెట్టాడు. 'క్యాప్చర్ ది ఫ్లాగ్' వంటి హ్యాకింగ్ పోటీల్లో పాల్గొని పలు బహుమతులు గెలుచుకున్నాడు. ఇటీవల సీబీఎస్ఈలోని ఆన్ స్క్రీన్ మార్కింగ్ పోర్టల్‌లో లోపాలను గుర్తించిన నిసర్గ.. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ సెక్యూరిటీ విభాగం సెర్ట్-ఇన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అతడి పేరు జాతీయ మీడియాలో మార్మోగింది. తాజా నియామకంపై నిసర్గ మాట్లాడుతూ.. 'ఫుల్‌టైమ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో పనిచేయడం ఆనందంగా ఉంది. అయితే, వేతనం నేను అనుకున్న దానికంటే తక్కువగానే ఉందని పేర్కొన్నాడు.

# ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి ఘటన

### కాల్పుల్లో ముగ్గురు నావికుల మృతి: ధృవీకరించిన మంత్రి

**న్యూఢిల్లీ, జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :** :ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని,




ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. సురేశ్ తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మిక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మరో నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారంరోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవిహార్‌గా తెలుస్తోంది.

# మట్టి పరీక్ష కార్యక్రమం కాసింపూర్ గ్రామం

## -మల్లారెడ్డి విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ -అగ్రికల్చరల్ సైన్సెస్, మైసమ్మగూడ ఆధ్వర్యంలో

**ఆందోల్ ప్రతినిధి జూన్ 11( ప్రజా రిపబ్లిక్ న్యూస్**



కాసింపూర్ గ్రామంలోని రైతుల పొలాల్లో మట్టి పరీక్ష (సోయిల్ టెస్టింగ్ ) కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా రైతుల పొలాల నుండి మట్టి నమూనాలను సేకరించి, వాటి భౌతిక మరియు రసాయన లక్షణాలను విశ్లేషించడం జరిగింది.

ఈ మట్టి పరీక్షల ద్వారా నేలలోని పోషక పదార్థాల స్థితిని తెలుసుకొని, పంటలకు అవసరమైన ఎరువుల వినియోగంపై రైతులకు శాస్త్రీయ సూచనలు అందించబడినాయి. రైతులు తమ పొలాల ఉత్పాదకతను పెంచుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ విద్యార్థులు సాయి ఆదిత్య, హరీష్, శ్రీనాథ్, కార్తీక్ మరియు చంద్రశేఖర్ చురుకుగా పాల్గొని మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు మరియు రైతులకు అవగాహన కల్పించడంలో సహకరించారు. ఈ కార్యక్రమం రైతులకు నేల ఆరోగ్యం గురించి అవగాహన పెంచడంతో పాటు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది.

# జోగిపేటలో మున్సిపల్ పాలకవర్గ ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 11 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

అందోల్ జోగిపేట పురపాలక సంఘం పరిధిలో ఈరోజు గౌరవ చైర్మన్ సార్ శ్రీ.ం. కృష్ణా రెడ్డి గారి అధ్యక్షతన 28 మంది లబ్ధి దారులకు కళ్యాణ లక్ష్మి, 13 మంది లబ్ధి దారులకు షాది ముభారక్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి వైస్ చైర్మన్ శ్రీ.ఆకుల సత్యనారాయణ గారు,కౌన్సిలర్ లు 1 వ వార్డు అరుణ్ కుమార్ గారు,2 వ వార్డు కోశికే రాజశేఖర్ గారు,3 వ వార్డు అరుణ కుమారి గారు,8 వ వార్డు నాగరత్నం గౌడ్ గారు,16 వ వార్డు శ్రీనివాస్ గారు, మరియు మాజీ కౌన్సిలర్ లు,కో ఆప్షన్ మెంబర్ లు,నాజు శ్రీకాంత్,ఎవీజ బిక్షపతి గౌడ్, మరియు ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా ముదిరాజ్ హక్కుల సాధన సమితి అధ్యక్షునిగా పిట్ల సాయి బాబా ముదిరాజ్ ఎన్నిక

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 11( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



మెదక్ జిల్లా ముదిరాజ్ హక్కుల సాధన సమితి అధ్యక్షునిగా తూప్రాన్ మండలం దాతర్ పల్లి గ్రామస్తుడు పిట్ల సాయి బాబా నూతనంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముదిరాజ్ సంఘ నాయకులు వారికి అధికారికంగా జారీ పత్రాన్ని అందించారు. పెద్ద చెరువు కట్ట హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జంగిడి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ కులాన్ని బిసి డి, నుండి ఏ లోకి మారుస్తామని ఇప్పుడున్న ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగింది. కానీ నేటికీ అది అమలు కాకపోవడం భదకరం అని అన్నారు. గత నలపై ఏండ్ల నుండి రాష్ట్రంలో ముదిరాజ్ లు పోరాటం చేస్తున్న నిమ్మకు నీరెత్తి నట్టుగా ప్రభుత్వాలు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. ఇలానే ఉంటే రాబోయే రోజుల్లో ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వెతున్న పోరాటం ఉధృతి చేస్తామని అన్నారు. జరగబోయే ఎన్నికల్లో ముదిరాజులు ఏకతాటిపై వచ్చి ఓటు ద్వారా ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని అన్నారు ఇందులో ముదిరాజ్ హక్కుల సాధన ఉపాధ్యక్షులు జిల్లెల సుధాకర్, ప్రధాన కార్యదర్శి సుతారి రాజు, పడిగే ప్రశాంత్, గుమ్మడి జనార్ధన్, వెంగలి వెంకటేష్, స్వామి తదితరులు ఉన్నారు.

# తెలంగాణ డీజీ పి సి వి ఆనంద్‌ని కలిసి శు భాకాంక్షలు తెలిపిన ఎం ఆర్ పి ఎస్ అధినేత ' పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 11 ప్రజా రిపబ్లిక్ న్యూస్**



ఇటీవల నూతనంగా తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ )గా బాధ్యతలు చేపట్టిన సి వి ఆనంద్ ఐపీఎస్ గారిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ' పద్మశ్రీ ' మందకృష్ణ మాదిగ గారు హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో గౌరవపూర్వకంగా కలవడం జరిగింది.

ఈ సందర్భంగా సి వి ఆనంద్ గారికి మంద కృష్ణ మాదిగ గారు పుష్పగుచ్ఛం అందించి , శాలువా కప్పి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎం ఆర్ పి ఎస్ మొదటి దశ ఉద్యమం జరుగుతున్న సందర్భంగా బషీర్ బాగ్ చౌరస్తాలో పోలీసు అధికారిగా విధులు నిర్వర్తించిన విషయాన్ని సి వి ఆనంద్ గారు గుర్తు చేసుకున్నారు. పోలీసు శాఖలో అపారమైన అనుభవం కలిగిన సి వి ఆనంద్ గారు తెలంగాణ రాష్ట్ర డీజీపీ గా నియమితులు కావడం సంతోషకరమని మంద కృష్ణ మాదిగ గారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాదిగ, ఎం ఎస్ పి జాతీయ నేత తిప్పారపు లక్ష్మణ్ మాదిగ ప్రముఖ గేయ రచయిత నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ , సినిమా దర్శకులు ప్రేమ్ రాజు,ఎం ఎస్ ఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివ కుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

**నారాయణఖేడ్ ప్రతినిధి జూన్ 11( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**




ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయ ఖాళీల భర్తీ, విద్యా హక్కు చట్టం అమలు, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ తదితర అంశాలపై ఏఐఎస్ఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి అధ్యక్షతన నారాయణఖేడ్ పట్టణంలోని అంబేద్కర్ భవన్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి హాజరైన విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ విద్య ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి దత్తు రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయడం వల్ల పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా సమాన విద్యా వ్యవస్థ సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు తాగునీరు, మరుగుదొడ్లు, లైబ్రరీలు, ప్రయోగశాలలు, డిజిటల్ తరగతి గదులు వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా చేసిన డిమాండ్లు,

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఈ సమావేశంలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి విద్యారంగ పరిరక్షణ కోసం విస్తృత ఉద్యమాలు చేపట్టాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నారాయణఖేడ్ మండలం కార్యదర్శి శ్రీరామ్ నాయక్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్వి జిల్లా నాయకులు అశోక్ రెడ్డి, ఆర్.పి.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అలిగే జీవన్, బీఎస్పీ నాయకులు పండరి, వివిధ ప్రజాసంఘాల నాయకులు రవీందర్ నాయక్, సాయిరాం,పుప్పాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ఖి ల్లాకు దేశస్థాయిలో గుర్తింపు తేవాలి

## జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 11 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**





మెదక్ ఖి ల్లాకు దేశ స్థాయిలో గుర్తింపు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు .

గురువారం మెదక్ కిల్లాను సందర్శించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్ సహకారంతో మెదక్ ఖిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి రాష్ట్ర, దేశ స్థాయిలో ముందుచ్చుతామని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు..ప్రజాపాలనప్రగతిప్రణాళికకార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అదనపు కలెక్టర్ నగేష్ ఇతర అధికారులు, మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ తో మెదక్ ఖిల్లా ను సందర్శించారు..

మెదక్ ఖిల్లపైన ఉన్న గజశాల, దర్వాజాలు,జైలును తదితర చారిత్రక అంశాలను కలెక్టర్ ప్రతిమ సింగ్ అడిగి తెలుసుకున్నారు.. మెదక్ ఖిల్ల పైన ఎక్కడ డ్యామేజ్ అయింది, ఎక్కడ శిథిలావస్థకు చేరింది అనే అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు..అందులో భాగంగా ఈరోజు ఖిల్లా పైన అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల మొక్కలను, ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. మెదక్ జిల్లాలో దొరికిన పురావస్తు విగ్రహాలు, తదితర శాసనాలు, వివిధ అంశాలతో మెదక్ ఖిల్లపై మ్యూజియంను ఏర్పాటు చేసి మెదక్ జిల్లా చరిత్రను చెప్పే విధంగా పర్యాటకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం కింద నిధులు తీసుకొచ్చి మెదక్ జిల్లాను మరింత అభివృద్ధి చేస్తామన్నారు... మెదక్ ఖిల్లాపై లెదర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాబోవు రోజుల్లో ఖిల్లా పై సాంస్కృతిక కార్యక్రమాలు చేయడానికి అనువైన ప్రదేశం అని కొనియాడారు. మెదక్ జిల్లా హైదరాబాద్ కు దగ్గరగా ఉన్నటువంటి నేపథ్యంలో జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను గుర్తించి మరింత అభివృద్ధి చేస్తామన్నారు..

# మీ భూమి - మీహక్కు ఈ -పాస్ బుక్స్ పంపిణీ

## రూపానంద రెడ్డి.

**రైల్వే కోడూరు జూన్ 11 రిపబ్లిక్ న్యూస్.**







ఓబులువారిపల్లి మండల పరిధిలోని గోబ్బురువారిపల్లి గ్రామ పంచాయతీ లో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ భూమి – మీ హక్కు ప్రభుత్వ రాజముద్ర తో కూడిన ఈ పాస్ బుక్కులు రైతులకు పంపిణీ చేయడం జరిగినది, ఈ కార్యక్రమం ఓబులవారిపల్లె మండలం తాసిల్దార్ సిద్దేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగినది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముఖరూపానంద రెడ్డి పాల్గొన్నారు అనంతరం ఆయన చేతుల మీదుగా రైతులకు ఈ పాసుబుక్కులు పంపిణీ చేయడం జరిగినది

ఈ కార్యక్రమంలో భాగంగా భూహక్కుదారులైనటువంటి రైతులకు తమ భూమికి గతంలో భూ పట్టాదారు పాస్ బుక్కులు పైన ముఖ్యమంత్రులు ఫోటోలు వేసుకొని పంపిణీ చేయడం జరిగేది అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ భూమి మీ హక్కు కార్యక్రమం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వ రాజముద్ర తో కూడిన పాస్ బుక్కులను పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేయడం తో అధికారులు చర్యలు చేపట్టి భూహక్కుదారులకు పాస్ బుక్కులు పంపిణీ చేయడం జరిగిందని రూపానంద రెడ్డి అన్నారు. తాసిల్దార్ సిద్దేశ్వరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ దృష్టి రైతుల భూములను రి సర్వే చేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ పాస్బుక్కులు పంపిణీ చేయడం జరిగిందని రైతులు భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిశీలించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఆయన రైతులకు సూచించారు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ రి సర్వే యొక్క ముఖ్య ఉద్దేశం రైతులు తమ భూముల్లో సమస్యలు లేకుండా రిసర్వే చేసి రైతులకు పాసుబుక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు కార్యక్రమాలు మండల సర్వేయర్ నాగమల్లేశ్వరి స్థానిక తెలుగుదేశం నాయకుడు మాజీ ఎంపీపీ తిరుపాలు, విఆర్ఓ వీఆర్ఏ

ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు గోబ్బురువారి పల్లి గ్రామ ప్రజలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న మెదక్

**ఇందిరమ్మ ఇంటి కల సాకారం..**

**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

**18వ వార్డులో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం**

**20, 21వ వార్డుల్లో కొత్త బోర్ల ప్రారంభం**

**ప్రజల అవసరాలే అభివృద్ధికి కొలమానం**

**మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు**

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 11( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



మెదక్ పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ప్రజల ప్రాథమిక అవసరాల పరిష్కారమే లక్ష్యంగా మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు వరుస అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఒకవైపు పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చుతూ 18వ వార్డులో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించగా, మరోవైపు 20, 21 వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారంగా కొత్త బోర్లను ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రోహిత్ రావు తెలిపారు. గురువారం 18వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారుల కుటుంబంతో ఆనందాన్ని పంచుకున్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. 20, 21వ వార్డుల్లో చాలా కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే, వెంటనే స్పందించి కొత్త బోర్ల తవ్వకాలకు చర్యలు చేపట్టారు. ప్రారంభించిన బోర్ల ద్వారా వందలాది కుటుంబాలకు తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయ జీవిత ధ్యేయమని ఎమ్మెల్యే రోహిత్ రావు స్పష్టం చేశారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నామని, ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. మెదక్ పట్టణంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం, బోర్ల ప్రారంభ కార్యక్రమాల సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చూపుతున్న ప్రజాప్రతినిధిగా రోహిత్ రావు పేరు తెచ్చుకుంటున్నారని కొనియాడారు.

పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, సంక్షేమం-అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ మెదక్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్,కౌన్సిలర్లు రాజమణి, మన్సూరు, శశాంక్, తాహేర్, గౌస్ ఖురేషి, మాజీ మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్ నాయకులు భూపతి రాజ్ బొజ్జ పవన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

# శిథిలావస్థకు చేరిన
# స్త్రీ సామూహిక మరుగు దొడ్లు

**పారిశుద్ధ్యం లోపంతో వర్షాకాలం గాంధీనగర్ కాలనీలో రోగాలు వ్యాప్తి చెందే అవకాశం**



**రానున్న వర్షాకాలంలో పెనుముప్పు**

శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్ల భవనం





రేకులు విరిగిన మరుగుదొడ్ల భవనం

**నంద్యాల, జూన్ 9, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని గాంధీనగర్ నందు మహిళల కోసం నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరింది. పరిశుభ్రత, భద్రత, ఆరోగ్య పరిరక్షణ లక్ష్యాలతో నిర్మించిన స్త్రీ సామూహిక మరుగు దొడ్లు మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో మహిళలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల గోడలు పగుళ్లు ఏర్పడి, రేకులు విరిగిపోయ్యాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి వృద్ధులు, గర్భిణీలు, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్ల పరిసరాల్లో చెత్త పేరుకుపోవడం, మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దుర్వాసన వ్యాపించి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చుట్టు ప్రక్కల ప్రజలు వాపోతున్నారు. “మరుగుదొడ్లు నిర్మించడం మాత్రమే కాకుండా వాటి నిర్వహణపై కూడా అధికారులు దృష్టి



సారించాలి. నీటి సౌకర్యం, శుభ్రత, భద్రత కల్పిస్తేనే వాటి అసలు ప్రయోజనం చేకూరుతుంది సంబంధిత అధికారులు శిథిలావస్థకు చేరిన సామూహిక మరుగుదొడ్లు మరమ్మతులు చేపట్టాలని, క్రమం తప్పకుండా శుభ్రపరిచే చర్యలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మహిళల గౌరవం, ఆరోగ్యం, సామాజిక భద్రత దృష్ట్యా ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలంటున్నారు

### రానున్న వర్షాకాలంలో పెనుముప్పు

పారిశుద్ధ్య విభాగం నిర్లక్ష్యంతో ఈ మరుగుదొడ్ల భవనం కులిపోయే అవకాశం ఉంది. సదరు అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తులు చేయించాలని గాంధీనగర్ స్థానిక మహిళలు వాపోతున్నారు రానున్న వర్షాకాలంలో పెనుముప్పు ఉందని భవనం శిథిలావస్థకు చేరి రేకులు విరిగిపోయ్యాయని ఆవేదన చెందుతున్నారు. ప్రక్కన ఉన్న ఇళ్ల పైకి ఎక్కి చూస్తే మరుగుదొడ్ల లోపలి భాగం కనిపించే అవకాశం ఉందని వెంటనే మరమ్మత్తులు చేయించాలని కోరుతున్నారు

### పారిశుద్ధ్యం లోపంతో వర్షాకాలం కాలనీ వాసులకు అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం

**- గాంధీనగర్ వాసులు**

స్థానిక మరుగుదొడ్ల వద్ద శుభ్రం చేయడానికి ఎవరు లేకపోవడంతో చెత్త పేరుకుపోవడం, మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దుర్వాసన వ్యాపించి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వచ్చేది వర్షకాలం మురుగు నీరు నిల్వ ఎక్కువగా పెరిగిపోతుందని ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

---

## “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“

### కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ప్రజలకు చేరువైన ప్రభుత్వ విజయాలను విస్తృతంగా చాటాలి -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, జూన్ 11( రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న “రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులతో కార్యక్రమ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సాధించిన ప్రగతిని ప్రజలకు విస్తృతంగా తెలియజేయడమే లక్ష్యంగా జూన్ 12 నుంచి 23వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లాస్థాయిలో జూన్ 17న నంద్యాల పట్టణంలోని టేక్కె మార్కెట్ యార్డులో భారీ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నందున, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి సుమారు 5,000 మంది లబ్ధిదారులు, మార్గదర్శులు, వివిధ వర్గాల ప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు, యువత, విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి విజయగాథలను కార్యక్రమంలో ప్రదర్శించడంతోపాటు ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగశక్తి, ఉద్యోగ మేళాల ద్వారా ఉపాధి పొందిన యువత, గృహ నిర్మాణ లబ్ధిదారులు, తదితర పథకాల




లబ్ధిదారులలో ఉత్తమ వక్తలను ఎంపిక చేసి కార్యక్రమంలో మాట్లాడేలా సిద్ధం చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమగ్రంగా ప్రతిబింబించే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, పరిశ్రమలు, పల్లె పండుగ, స్వచ్ఛత, పర్యాటకం, మౌలిక సదుపాయాలు, హరితాభివృద్ధి తదితర రంగాలలో జిల్లాలో సాధించిన పురోగతిని గణాంకాలతో సహా ఆకర్షణీయంగా ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. టేక్కె ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ఎల్ఈడి స్క్రీన్లు, వైద్య శిబిరాలు, రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసే వేదికగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రాము నాయక్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మధుమణి ఆసుపత్రి ఉచిత శస్త్ర చికిత్సల సేవలు ప్రశంసనీయం: మంత్రి ఫరూక్

**- 37 వ ఉచిత శస్త్ర చికిత్సల శిబిర కరపత్రాలు విడుదల చేసిన మంత్రి ఫరూక్**

**- జులై 20 నుండి 26 వ తేదీ వరకు వారం రోజులపాటు 50 లక్షల రూపాయల విలువ చేసే 100 శస్త్ర చికిత్సలు నిర్వహిస్తాం: డాక్టర్ మధుసూదనరావు**

**-. వారం రోజులు ఉచిత ఓపిడి సేవలు మరియు మందుల పంపిణీ: డాక్టర్ మణిదీప్**

**నంద్యాల జూన్ 11 (రిపబ్లిక్ న్యూస్) :**

మధుమణి ఆసుపత్రి ఆధ్వర్యంలో గత 36 సంవత్సరాలుగా ప్రతిఏటా నిర్వహిస్తున్న ఉచిత చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సల ఉచిత వైద్య శిబిరం ఈ ఏడాది నిర్వహించే శిబిరం కరపత్రాలను రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

మధుమణి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం జూలై 20 నుండి 26వ తేదీ వరకు వారం రోజులపాటు ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ నాగమణి,డాక్టర్ మణిదీప్ ఉచిత శస్త్ర చికిత్సల శిబిరం నిర్వహిస్తున్నారు.

కరపత్రాల విడుదల సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం నిరుపేదలకు ఖరీదైన శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ మధుసూదనరావు సేవలు ఆదర్శనీయమని ప్రశంసించారు. నంద్యాల వైద్యులు అనేకమంది విస్తృత సేవలు అందించడం హర్షనీయమన్నారు.

ఆసుపత్రి నిర్వాహకులు ప్రముఖ చెవి ముక్కు గొంతు వైద్యులు డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ మణిదీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులలో 50 లక్షలు విలువచేసే 100 శస్త్ర చికిత్సలు నిరుపేదలకు ఉచితంగా చేస్తామని, వారం రోజులు ఉచిత ఓపిడి సేవలు మందులు కూడా ఉచితంగా అందజేస్తామని అన్నారు.

తమతో పాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఈఎన్టి వైద్యులు చెన్నైకి చెందిన డాక్టర్ కైలాస్ స్వామి, డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి, బెంగళూరుకు చెందిన దీపక్ హల్దిపూర్, డాక్టర్ శ్రీనివాసమూర్తి, డాక్టర్ మంజునాథ్,డాక్టర్ హర్షద్, విజయవాడకు చెందిన డాక్టర్ విద్యాసాగర్, కరీంనగర్ డాక్టర్ శ్రీపతి నాయుడు, హైదరాబాద్ కు చెందిన డాక్టర్ తేజస్వి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రోహిత్ శస్త్ర చికిత్సలు చేస్తారని, ఈ ఆపరేషన్లకు అవసరమైన అనస్తీసియా ప్రముఖ మత్తు మందు వైద్యులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మాధవి డాక్టర్ వంశీ సేవలందిస్తారని తెలిపారు.



మధుమణి ఆసుపత్రి 37వ ఉచిత శస్త్ర చికిత్సల శిబిరం కరపత్రాలు విడుదల చేస్తున్న రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్. చిత్రంలో వైద్యులు డాక్టర్ మధుసూదనరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం డి ఫిరోజ్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ హరిబాబు, డాక్టర్ మణిదీప్, మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్.

కేవలం నిరుపేదలు అయిన వారికి మాత్రమే చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ తో పాటు డాక్టర్ మధుసూదనరావు, . కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హరిబాబు, డాక్టర్ మణిదీప్ ,తెలుగుదేశం పార్టీ మాజీ కౌన్సిలర్ శివశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com